02-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఈ జ్ఞానము పూర్తిగా శాంతియుతమైనది, ఇందులో ఏమీ మాట్లాడాల్సిన అవసరము లేదు, కేవలం శాంతిసాగరుడైన తండ్రిని స్మృతి చేస్తూ ఉండండి"

ప్రశ్న:- ఉన్నతికి ఆధారమేమిటి? తండ్రి శిక్షణలను ఎప్పుడు ధారణ చేయగలుగుతారు?

జవాబు:- ఉన్నతికి ఆధారము ప్రేమ, ఒక్క తండ్రి పట్ల సత్యమైన ప్రేమ ఉండాలి. సమీపంగా ఉంటూ కూడా ఒకవేళ ఉన్నతి జరగడం లేదు అంటే తప్పకుండా ప్రేమలో లోపం ఉన్నట్లు. ప్రేమ ఉన్నట్లయితే తండ్రిని స్మృతి చేస్తారు. స్మృతి చేయడం ద్వారా అన్ని శిక్షణలను ధారణ చేయగలుగుతారు. ఉన్నతి కొరకు తమ సత్యాతి-సత్యమైన చార్టును వ్రాయండి. తండ్రి నుండి ఏ విషయాన్ని దాచి పెట్టకండి. ఆత్మాభిమానులుగా అవుతూ స్వయాన్ని సరిదిద్దుకుంటూ ఉండండి.

ఓం శాంతి. పిల్లలూ, స్వయాన్ని ఆత్మగా భావించి కూర్చోండి మరియు తండ్రిని స్మృతి చేయండి. బాబా ప్రశ్నిస్తున్నారు - మీరు ఎప్పుడైనా ఎక్కడైనా సభలో భాషణ చేసేటప్పుడు - మీరు స్వయాన్ని ఆత్మగా భావిస్తున్నారా లేక దేహముగా భావిస్తున్నారా అని వారిని ఘడియ-ఘడియ అడుగుతున్నారా? స్వయాన్ని ఆత్మగా భావిస్తూ ఇక్కడ కూర్చోండి. ఆత్మయే పునర్జన్మలలోకి వస్తుంది. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ పరమపిత పరమాత్మను స్మృతి చేయండి. తండ్రిని స్మృతి చేయడం ద్వారానే మీ వికర్మలు వినాశనమవుతాయి, దీనిని యోగాగ్ని అని అంటారు. నిరాకార తండ్రి నిరాకారీ పిల్లలకు చెప్తున్నారు - నన్ను స్మృతి చేయడం ద్వారా మీ పాపాలు తొలగిపోతాయి మరియు మీరు పావనంగా అయిపోతారు. అప్పుడు మీరు ముక్తి-జీవన్ముక్తులను పొందుతారు. అందరూ ముక్తి తర్వాత జీవన్ముక్తిలోకి తప్పకుండా రావాల్సిందే. కావున ఘడియ-ఘడియ చెప్పాల్సి ఉంటుంది - స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకొని కూర్చోండి. సోదరీ-సోదరులారా, స్వయాన్ని ఆత్మగా భావిస్తూ కూర్చోండి మరియు తండ్రిని స్మృతి చేయండి. ఈ ఆజ్ఞను తండ్రే ఇచ్చారు. ఇది స్మృతి యాత్ర. తండ్రి అంటున్నారు - నాతో బుద్ధియోగాన్ని జోడించినట్లయితే మీ జన్మ-జన్మాంతరాల పాపాలు భస్మమైపోతాయి. ఈ విషయాన్ని మీరు పదే-పదే స్మృతి చేయిస్తే, అర్థం చేయిస్తే అప్పుడు ఆత్మ అవినాశీ అని, దేహము వినాశీ అని అర్థం చేసుకుంటారు. అవినాశీ ఆత్మయే వినాశీ దేహాన్ని ధారణ చేసి, పాత్రను అభినయించి, ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటుంది. ఆత్మ స్వధర్మము శాంతి. వారికి తమ స్వధర్మము గురించి కూడా తెలియదు. ఇప్పుడు తండ్రి చెప్తున్నారు - నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి. ముఖ్యమైన విషయము ఇదే. మొట్టమొదట పిల్లలైన మీరు ఈ విషయములోనే కష్టపడాలి. అనంతమైన తండ్రి ఆత్మలకు చెప్తున్నారు. ఇందులో శాస్త్రాల గురించి ప్రస్తావించాల్సిన అవసరమేమీ లేదు. మీరు కేవలం గీత ఉదాహరణను ఇచ్చినా కూడా - మీరు కేవలం గీతను గురించే ఎందుకు ప్రస్తావిస్తారు, వేదాల గురించి ఎందుకు ప్రస్తావించరు అని అడుగుతారు. బాబా అన్నారు - వేదాలు ఏ ధర్మము యొక్క శాస్త్రాలు అని వారిని అడగండి.

(ఆర్యధర్మానికి చెందినవి అని వారు అంటారు). ఆర్యులు అని ఎవరిని అంటారు? అది హిందూ ధర్మమైతే కాదు. ఆదిసనాతనమైనదైతే దేవీ-దేవతా ధర్మమే. మరి ఆర్య అన్నది ఏ ధర్మము? ఆర్య అన్నది ఆర్య సమాజుల ధర్మమై ఉంటుంది. వాస్తవానికి ఆర్య ధర్మము అన్న పేరే లేదు. ఆర్య ధర్మాన్ని ఎవరు స్థాపించారు? మీరు వాస్తవానికి గీతను కూడా ప్రస్తావించవలసిన అవసరం లేదు. మొట్టమొదటి విషయమేమిటంటే - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేసినట్లయితే సతోప్రధానముగా అయిపోతారు. ఈ సమయంలో అందరూ తమోప్రధానముగా ఉన్నారు. మొట్టమొదటైతే తండ్రి పరిచయాన్నే ఇవ్వాలి. మహిమ కూడా తండ్రిదే చేయాలి. ఎప్పుడైతే మీరు స్వయం తండ్రిని స్మృతి చేస్తూ ఉంటారో, అప్పుడే మీరు ఈ విషయాన్ని ఇతరులకు చెప్పగలుగుతారు కూడా. ఈ విషయంలో పిల్లలలో బలహీనత ఉంది.

బాబా ఎల్లప్పుడూ అంటూ ఉంటారు - స్మృతి యాత్ర యొక్క చార్టును పెట్టండి. నేను ఎంతవరకూ స్మృతి చేస్తున్నాను అని ప్రతి ఒక్కరూ తమ హృదయాన్ని ప్రశ్నించుకోవాలి. పిల్లలైన మీ హృదయంలో అపారమైన సంతోషము ఉండాలి. మీకు ఆంతరిక సంతోషము ఉంటే ఇతరులకు అర్థం చేయించినప్పుడు ప్రభావం పడుతుంది. మొట్టమొదటి ముఖ్యమైన విషయము ఏం చెప్పాలంటే - సోదరీ సోదరులారా, స్వయాన్ని ఆత్మగా భావించండి. ఈ విధంగా ఇంకే సత్సంగములోనూ చెప్పరు. వాస్తవానికి సత్సంగమంటూ ఏదీ లేదు. సత్యమైన సాంగత్యము ఒక్కటే. మిగిలినవన్నీ

చెడు సాంగత్యాలే. ఇక్కడున్నది పూర్తిగా కొత్త విషయము. వేదాల ద్వారా ఏ ధర్మస్థాపనా జరుగలేదు కావున మేము వేదాలను ఎందుకు ప్రస్తావించాలి? ఎవ్వరిలోనూ ఈ జ్ఞానం లేదు. స్వయమే నేతి, నేతి అని అంటారు అనగా మాకు తెలియదు అని అంటారు, మరి నాస్తికులైనట్లే కదా. ఇప్పుడు తండ్రి స్వయంగా చెప్తున్నారు - ఆస్తికులుగా అవ్వండి, స్వయాన్ని ఆత్మగా భావించండి. గీతలో ఈ విషయాలు కొన్ని ఉన్నాయి కానీ వేదాలలో లేవు. వేదోపనిషత్తులైతే ఎన్నో ఉన్నాయి. ఇప్పుడవి ఏ ధర్మ శాస్త్రాలు? మనుష్యులైతే తమ విషయాలనే చెబుతూ ఉంటారు. మీరు ఎవరి మాటలనూ వినకూడదు. తండ్రి అయితే సహజముగా అర్థం చేయిస్తారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేసినట్లయితే పావనంగా అయిపోతారు, అందుకే ప్రపంచ చరిత్ర-భౌగోళములను తెలుసుకోవాలి. మీ ఈ త్రిమూర్తి మరియు సృష్టిచక్రము ముఖ్యమైనవి. వీటిలో అన్ని ధర్మాలూ వచ్చేస్తాయి. మొట్టమొదటిది దేవీ-దేవతా ధర్మము. బాబా అన్నారు - త్రిమూర్తి, సృష్టిచక్రమును పెద్ద-పెద్దగా తయారుచేసి ఢిల్లీలోని ముఖ్య స్థానాలలో ఎక్కడైతే రావడం, పోవడం జరుగుతూ ఉంటుందో అక్కడ పెట్టండి. అవి టిన్ షీట్ పై ఉండాలి. మెట్ల చిత్రములోనైతే ఇతర ధర్మాల గురించి ఉండదు. ముఖ్యమైనవి ఈ రెండు చిత్రాలు. వీటి పైనే అర్థం చేయించాలి. మొట్టమొదటిది తండ్రి పరిచయము. తండ్రి నుండే వారసత్వము లభిస్తుంది. ఈ విషయంపై నిశ్చయాన్ని ఏర్పరచకుండా మీ విషయాలేవీ ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. ఒక్క తండ్రినే అర్థం చేసుకోకపోతే ఇక ఇతర చిత్రాల వైపుకు తీసుకువెళ్ళడం వ్యర్థమే. అల్లాను అర్థం చేసుకోకుండా ఇంకేమీ అర్థం చేసుకోరు. తండ్రి పరిచయం ఇవ్వకుండా ఇంకే విషయాలూ మాట్లాడకండి. తండ్రి నుండే అనంతమైన వారసత్వం లభిస్తుంది. ఇటువంటి సహజమైన విషయాన్ని ఎందుకు అర్థం చేసుకోరు అని బాబా ఆలోచిస్తూ ఉంటారు. మీ ఆత్మకు తండ్రి ఆ శివుడు, వారి నుండే వారసత్వము లభిస్తుంది. మీరందరూ పరస్పరం సోదరులు. ఎప్పుడైతే ఈ విషయాన్ని మర్చిపోతారో అప్పుడు తమోప్రధానంగా అయిపోతారు. ఇప్పుడు తండ్రిని స్మృతి చేసినట్లయితే సతోప్రధానంగా అయిపోతారు. రచయిత మరియు రచనలను తెలుసుకోవడమే ముఖ్యమైన విషయము. వాటి గురించి ఎవ్వరికీ తెలియదు. ఋషులు, మునులకు కూడా తెలియదు. కావున మొదట తండ్రి పరిచయాన్ని ఇచ్చి అందరినీ ఆస్తికులుగా తయారుచేయాలి. తండ్రి అంటారు, నన్ను తెలుసుకోవడం ద్వారా మీరు అంతా తెలుసుకుంటారు. నన్ను తెలుసుకోకపోతే మీరు ఏమీ అర్థం చేసుకోలేరు. అనవసరంగా మీరు మీ సమయాన్ని వృధా చేసుకుంటారు. చిత్రాలు మొదలైనవేవైతే డ్రామానుసారంగా తయారయ్యాయో, అవే సరైనవి. కానీ మీరు ఎంతో కష్టపడినా కానీ ఎవరి బుద్ధిలోనూ కూర్చోవడం లేదు. పిల్లలు అడుగుతారు - బాబా, మేము అర్థం చేయించడంలో ఏమైనా పొరపాటు ఉందా? బాబా వెంటనే అంటారు - అవును, పొరపాటు ఉంది, అల్లా గురించే అర్థం చేసుకోకపోతే వారిని వెంటనే రవాణా చేసేయండి. వారికి చెప్పండి - ఎప్పటివరకైతే తండ్రిని తెలుసుకోరో అప్పటివరకూ మీ బుద్ధిలో ఏమీ కూర్చోదు. మీరు కూడా దేహీ-అభిమానీ అవస్థలో ఉండకపోతే, కనులు అశుద్ధముగానే ఉంటాయి. ఎప్పుడైతే స్వయాన్ని ఆత్మగా భావిస్తారో అప్పుడే కనులు శుద్ధంగా అవుతాయి. దేహీ-అభిమానులుగా అయినట్లయితే అప్పుడిక కనులు మిమ్మల్ని మోసగించవు. దేహీ-అభిమానులుగా లేకపోతే మాయ మోసగిస్తూ ఉంటుంది, అందుకే మొదట ఆత్మాభిమానులుగా అవ్వాలి. బాబా అంటారు, మీ చార్టును చూపించినట్లయితే తెలుస్తుంది. ఒకవేళ ఇప్పటివరకూ ఇంకా అబద్ధాలు, పాపాలు, కోపము ఉన్నట్లయితే మిమ్మల్ని మీరే సర్వనాశనం చేసుకుంటారు. బాబా చార్టు చూసి అర్థం చేసుకుంటారు - వీరు సత్యం వ్రాసారా లేక అసలు దీని అర్థాన్ని కూడా అర్థం చేసుకోలేదా అని. పిల్లలందరికీ బాబా, చార్టు వ్రాయండి అని చెప్తారు. ఏ పిల్లలైతే యోగములో ఉండరో వారు అంతటి సేవను కూడా చేయలేరు. పదును అంతగా నిండదు. కోట్లలో ఏ ఒక్కరో వెలువడుతారు అని బాబా అంటారు, కానీ మీరు స్వయమే యోగములో ఉండకపోతే ఇక ఇతరులకు ఎలా చెప్తారు.

సన్యాసులు, సుఖము కాకిరెట్టతో సమానమైనది అని అంటారు. వారు సుఖము యొక్క మాటే ప్రస్తావించరు. భక్తి అపారంగా ఉందని మీకు తెలుసు. అందులో ఎంత శబ్దము ఉంది, మీ జ్ఞానమైతే ఎంతో శాంతియుతమైనది. మీరు చెప్పండి - శాంతిసాగరుడైతే ఒక్క తండ్రే. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయాలి. తండ్రి మన్మనాభవ అని చెప్తున్నారు. ఈ పదాన్ని కూడా ఉపయోగించకండి. హిందుస్థాన్ భాష హిందీ, మరి వేరే భాష అయిన సంస్కృతం ఎందుకు? ఇప్పుడిక ఈ భాషలన్నింటినీ విడిచిపెట్టండి. మొదట మీరు స్వయాన్ని ఆత్మగా భావించండి అని భాషణ చేయండి. స్వయాన్ని ఆత్మగా కూడా భావించలేనివారు, స్మృతి చేయలేనివారు ఎందరో ఉన్నారు. వారి నష్టాన్ని వారు అర్థం చేసుకోలేకపోతున్నారు. కళ్యాణమైతే తండ్రి స్మృతిలోనే ఉంటుంది. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి అని ఇంకే సత్సంగములోనూ ఈ విధంగా చెప్పరు. పిల్లలు ఎప్పుడైనా తమ తండ్రిని ఒక స్థానములో కూర్చొని స్మృతి చేస్తారా? లేస్తూ, కూర్చుంటూ తండ్రి స్మృతి ఉండనే ఉంటుంది. ఆత్మాభిమానులుగా అయ్యే అభ్యాసమును చేయాలి. మీరు చాలా చెప్తూ ఉంటారు, అంతగా చెప్పకూడదు. ముఖ్యమైన విషయము స్మృతియాత్రకు

సంబంధించినది. యోగాగ్ని ద్వారానే మీరు పావనంగా అవుతారు. ఈ సమయంలో అందరూ దుఃఖితులుగా ఉన్నారు. పావనంగా అవ్వడం ద్వారానే సుఖము లభిస్తుంది. మీరు ఆత్మాభిమానులుగా అయి ఎవరికైనా అర్థం చేయిస్తే వారికి బాణం తగులుతుంది. ఎవరైనా తాము స్వయమే వికారులుగా ఉంటూ ఇతరులకు నిర్వికారులుగా అవ్వండి అని చెప్తే వారికి బాణం తగలదు. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు స్వయం స్మృతియాత్రలో ఉండడం లేదు, అందుకే బాణం కూడా తగలడం లేదు.

ఇప్పుడు తండ్రి అంటారు - అయిపోయిందేదో అయిపోయింది, ముందు మీరు స్వయాన్ని తీర్చిదిద్దుకోండి. మీ హృదయాన్ని ప్రశ్నించుకోండి - నేను స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని ఎంతగా స్మృతి చేస్తున్నాను? ఆ తండ్రి మనల్ని విశ్వానికి యజమానులుగా తయారుచేస్తారు. మనం శివబాబా పిల్లలము కావున తప్పకుండా మనం విశ్వాధిపతులుగా అవ్వాలి. ఆ ప్రియుడే వచ్చి మీ ఎదురుగా నిలబడ్డారు కావున వారి పట్ల చాలా ప్రేమ ఉండాలి. ప్రేమ అనగా స్మృతి. వివాహం జరిగిన తర్వాత స్త్రీకి తన పతి పట్ల ఎంత ప్రేమ ఉంటుంది. మీకు కూడా నిశ్చితార్థం జరిగింది, వివాహం కాదు. విష్ణుపురిలోకి వెళ్ళినప్పుడు వివాహం జరుగుతుంది. మొదట శివబాబా వద్దకు వెళ్తారు, ఆ తర్వాత అత్తవారింటికి వెళ్తారు. నిశ్చితార్థపు సంతోషమేమైనా తక్కువ ఉంటుందా. నిశ్చితార్థం అవ్వగానే స్మృతి పక్కా అయిపోతుంది. సత్యయుగములో కూడా నిశ్చితార్థము జరుగుతుంది. కానీ అక్కడ ఎప్పుడూ నిశ్చితార్థాలు తెగిపోవు, అకాల మృత్యువులు జరుగవు. అవి ఇక్కడే జరుగుతాయి. పిల్లలైన మీరు కూడా గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రముగా అవ్వాలి. చాలా సమీపముగా ఉన్నా కూడా అంత ఉన్నతిని పొందరు. ఎవరైతే అటువంటి ప్రేమతో వస్తారో వారి ఉన్నతి ఎంతగానో జరుగుతుంది. స్మృతే లేకపోతే ప్రేమ కూడా ఉండదు. అప్పుడు వారి శిక్షణలను కూడా ధారణ చేయలేకపోతారు.

భగవానువాచ - పిల్లలైన మీరు అందరికీ ఈ సందేశమునే ఇవ్వండి, కామం మహాశత్రువు, అది ఆదిమధ్యాంతమూ దుఃఖమునిస్తుంది. మీరైతే పవిత్రముగా సత్యయుగానికి యజమానులుగా ఉండేవారు. ఇప్పుడు మీరు కిందపడి అశుద్ధముగా అయిపోయారు. ఇప్పుడు ఈ అంతిమ జన్మలో మళ్ళీ పవిత్రముగా అవ్వండి. కామచితిపై కూర్చునే కంకణమును క్యాన్సిల్ చేయండి. పిల్లలైన మీరు ఎప్పుడైతే యోగములో ఉంటూ చెప్తారో, అప్పుడు ఎవరి బుద్ధిలోనైనా కూర్చుంటుంది. జ్ఞానమనే ఖడ్గముకు యోగమనే పదును కావాలి. మొదటిగా ముఖ్యమైన విషయము ఒక్కటే. పిల్లలు అంటారు, బాబా, మేము చాలా కష్టపడుతున్నాము, అప్పుడు కష్టం మీద ఏ ఒక్కరో వెలువడుతున్నారు. బాబా అంటారు, యోగములో ఉంటూ అర్థం చేయించండి. స్మృతియాత్ర చేసే శ్రమ చేయండి. రావణుడితో ఓడిపోయి వికారులుగా అయ్యారు, ఇప్పుడు ఇక నిర్వికారులుగా అవ్వండి. తండ్రి స్మృతి ద్వారా మీ మనోకామనలన్నీ పూర్తవుతాయి. బాబా స్వర్గాధిపతులుగా తయారుచేస్తారు. బాబా డైరెక్షన్లనైతే ఎన్నో ఇస్తారు, కానీ పిల్లలు వాటిని బాగా క్యాచ్ చేయరు, వేరే-వేరే విషయాలలోకి వెళ్ళిపోతారు. ముఖ్యముగానైతే తండ్రి సందేశాన్ని ఇవ్వండి. కానీ, స్వయమే స్మృతి చేయకపోతే మరి ఇతరులకు ఎలా చెప్తారు? ఇక్కడ మోసం నడవదు. ఇతరులకు వికారాలలోకి వెళ్ళకండి అని చెప్తూ స్వయం వెళ్తే తప్పకుండా మనసు తింటుంది. ఈ విధమైన మోసం చేసేవారు కూడా ఉన్నారు. అందుకే బాబా చెప్తున్నారు, ముఖ్యమైన విషయము అల్ఫ్ (భగవంతుడు). భగవంతుడిని తెలుసుకోవడం ద్వారా మీరు సర్వస్వాన్ని తెలుసుకుంటారు. భగవంతుడిని తెలుసుకోకపోతే మీరు ఏమీ అర్థం చేసుకోలేరు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఆంతరికంగా తండ్రి స్మృతి యొక్క సంతోషంలో ఉంటూ ఇతరులకు తండ్రి పరిచయాన్ని ఇవ్వాలి, అందరికీ ఒక్క తండ్రి యొక్క మహిమను వినిపించాలి.

2. ఆత్మాభిమానులుగా అయ్యేందుకు ఎంతో ప్రాక్టీస్ చేయాలి, ఎక్కువ మాట్లాడకూడదు. గతం గతః చేసి ముందు స్వయాన్ని సరిదిద్దుకోవాలి. స్మృతియాత్ర యొక్క సత్యమైన చార్టును పెట్టాలి.

వరదానము:- బ్రాహ్మణ జీవితంలో వెరైటీ అనుభూతుల ద్వారా రమణీకతను అనుభవం చేసే సంపన్న ఆత్మా భవ
జీవితంలో ప్రతి మనుష్యాత్మకు ఇష్టమైనది వెరైటీ. కావున మొత్తం రోజంతటిలో భిన్న-భిన్న

సంబంధాలు, భిన్న-భిన్న స్వరూపాల వెరైటీని అనుభవం చేయండి, అప్పుడు ఎంతో రమణీకమైన జీవితాన్ని అనుభవం చేస్తారు. బ్రాహ్మణ జీవితము భగవంతునితో సర్వ సంబంధాలను అనుభవం చేసే సంపన్నమైన జీవితము, అందుకే ఒక్క సంబంధంలో కూడా లోటు ఉండనివ్వకండి. ఒకవేళ ఏ కొంచమైనా లేక తేలికపాటిగానైనా ఆత్మ యొక్క సంబంధము మిక్స్ అయినట్లయితే ‘సర్వ’ అన్న పదము సమాప్తమైపోతుంది. ఎక్కడైతే ‘సర్వ’ సంబంధాలు ఉంటాయో, అక్కడే సంపన్నత ఉంటుంది, అందుకే సర్వ సంబంధాలతో స్మృతి స్వరూపులుగా అవ్వండి.

**స్లోగన్:-** తండ్రి సమానంగా అవ్యక్త రూపధారులుగా అయ్యి ప్రకృతి యొక్క ప్రతి దృశ్యాన్ని చూసినట్లయితే అలజడిలోకి రారు.